


# సర్పశిల

## - భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

ఇప్పటి వరకూ జరిగిన కథ

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

"**మధ్యప్రదేశ్‌లో** మరణ మృదంగం.. నిలిచిపోయిన రైలు కంపార్ట్‌మెంట్లు ఒకదానికొకటి గుద్దుకుని చాలామందికి గాయాలు. పట్టాలు తప్పిన కొన్ని కంపార్టుమెంట్లు" న్యూస్ చదువుతోంది న్యూస్ రీడర్. ఇండియన్ ఏర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీవాళ్ళు హెలికాప్టర్స్‌లో శాయశక్తులా ప్రయాణికులకు సాయం చేస్తున్నారు. క్షతగాత్రులను హెలికాప్టర్‌లోకి ఎక్కించి వైద్యశాలలకు తీసికెడుతున్నారు. పై బెర్త్ మీంచి కిందపడి చనిపోయిన వారి సంఖ్య 62. చాలామంది వృద్ధులే.

"అయ్యా.. రిజర్వేషన్ ఫామ్ లోనే వయసు ఎంతో తెలుస్తుందిగా. వయసు మీరిన వారికీ, స్త్రీలకి పై బెర్తులు ఇవ్వకూడదుగదా. నా చిన్నతనం నించీ ఇదే తంతు. భార్యాభర్తలు రిజర్వేషన్ చేయించుకుంటే, భర్తకి ఒకచోట, భార్యకి ఒక చోట ఇస్తారు. కుటుంబంలోని పేరులన్నీ ఒకే రిజర్వేషన్ ఫామ్ మీద వ్రాసి ఇచ్చినా, సీట్లు మాత్రం ఒక చోట్లో రావు. వృద్ధులందరూ పుటిక్కిన పోయారుగదా!" అన్నారు శర్మగారు.

"అవునవును. ఆ విషయంలో అందరికీ అవే అనుభవాలు. పక్కవాణ్ణో, ఎదటివాడ్నో, పై వాడ్నో బ్రతిమాలాడుకుంటేనే గానీ భార్యాభర్తలు ఒకచోట కూర్చోవడం సాధ్యం కాదు. ఇప్పుడేమో అవేవో కంప్యూటర్లు వచ్చాయి. అవ్వీ మనుషుల్లాగానే సీతనో చోట రాముడ్ని ఓ చోట కూర్చోపెట్టి చోద్యం చూస్తున్నాయి" మహాదేవన్ అన్నారు.

"మీరేమంటారు?" పరమేశ్వర శాస్త్రిని చూస్తూ అన్నారు యజ్ఞప్ప.

"నేను ట్రైన్ గురించి ఆలోచించడంలేదు. ఎదటనించి ఏ ట్రైనూ గుద్దుకోవడానికి రాలేదని న్యూస్‌లో చెబుతున్నారు. సడన్‌గా బ్రేకు ఎందుకు వేశాడో డ్రైవర్ చెప్పలేకపోతున్నాడు. అతని మొహం సామాన్యంగా లేదు. ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టు ఉంది. చనిపోయిన గాయపడ్డవారంతా అమాయకులుగానే కనిపిస్తున్నారు. పట్టాలు ఎవరూ తీసివేసిన దాఖలాలు గానీ, పేల్చేసిన దాఖలాలుగానీ లేవు. మరి యీ ప్రమాదానికి కారణం ఏమిటీ? కో డ్రైవర్ పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. దెబ్బకూడా తగిలి అపస్మారకస్థితిలో ఉన్నాడు. వారిద్దరూ చెబితే తప్ప అసలేం జరిగిందో మనకి అవగతం కాదు" ఏకాగ్రతతో టీవీనే చూస్తూ ఉన్నారు శాస్త్రిగారు. ఎలా వచ్చారో మరి చాలామంది విలేఖరులు  బాధితుల్ని ఇంటర్వ్యూ చేస్తున్నారు.

"ఒకనాడు ప్రమాదస్థితికి చేరేసరికే రోజులు పట్టేది. ఇవాళ  సాంకేతికత పెరిగింది. ప్రయాణ వేగానికి కొరతలేదు. అందుకే తక్షణ సాయం అందుతోంది. రాత్రికి రాత్రే హెలికాప్టర్లు వచ్చాయంటే, 'కబురు' ఎంత త్వరగా చేరవలసిన వారికి చేరిందో అర్థమవుతున్నది" అన్నాడు శ్రీనివాస్.

"అవును.  సాంకేతికత పెరిగింది. వేగమూ పెరిగింది. కానీ, మానవుడి ఆలోచనా ధోరణి మారలేదు. అరిషడ్వర్గాల వలలో చిక్కుకుని తానేం చేస్తున్నాడో, తనకే తెలియని స్థితిలో ఆలోచిస్తున్నాడు. లోకాన్ని జయిస్తున్నాడు  గానీ తనని తాను గెలవలేకపోతున్నాడు. బ్రతుకు అశాశ్వతమనీ మరణం తప్పదనీ తెలిసికూడా చేసిన తప్పుల్నే మళ్ళీ మళ్ళీ చేస్తున్నాడు. అంతులేని ఆశతో అసహనం పాలవుతున్నాడు అన్నారు యజ్ఞప్ప.

"అన్నీ నిజమే కానీ.." ఆగాడు గోర్కీ.

"ఊ..కానీ?" అడిగాడు స్టిట్సన్.

"ఈ ప్రమాదాన్ని లోతుగా పరిశీలించాలి మిత్రమా!" సాలోచనగా అన్నాడు గోర్కీ.

"యెస్.. జరిగిన తీరే విచిత్రంగా ఉంది. అయితే విద్రోహుల కారెక్రలాపం అవ్వాలి???????. కానీ, ఆ గుర్తులు కనబడటంలేదు. అంటే కారణం మరేదో ఉండాలి. బలీయమైనదై ఉండాలి" అనాడు డాంటే.

"కానీ, అక్కడికి వెళ్ళి పరిశీలించడం కష్టం. మనం వెళ్ళేలోగా మనం వెతికే సమాచారం మాయమై పోవచ్చు. మా సిటీ అబ్జర్వర్ జర్నలిస్ట్‌ని పంపమంటాను" ఫోన్ వైపు నడుస్తూ అన్నాడు దడ్లానీ.

"ఓహ్.. అక్కడ చూడండి" టివి వైపు చూపిస్తూ సంభ్రమంగా అన్నది శరద్వతి. ట్రైన్‌లో మహాకన్యాదేవీ, మహామాయీ వాళ్ళు ఉన్న కంపార్టుమెంట్‌ని చూపిస్తున్నారు.

"అమ్మ ముందరే అన్నది 'ఈ ట్రైన్ ఈ ట్రైన్ 'అని." హనుమంతు చెపుతున్నాడు.

"అమ్మంటే మీరా?" మహామాయిని అడిగాడు వీడియోగ్రాఫర్.

"కాదు.. ఆవిడ" అన్నాడు హనుమంతు మహాకన్యాదేవిని చూపిస్తూ. మహాకన్యాదేవి ముఖం అలసి ఉంది. ఉగ్రంగా ఉంది.

"మీరు ట్రైను గురించి ఏం చెప్పారూ?" అడిగాడు విలేఖరి.

"అమ్మ ఏమీ చెప్పలేదు.. కలవరించింది" అన్నాడు హనుమంతు.

"అమ్మ ... మీరు నిద్రలో కలవరించారా? ఆ కలలో ఏమి చూశారూ?" అడిగాడు వీడియోగ్రాఫర్.

మహాకన్యాదేవి ఉలిక్కిపడటం అందరూ గుర్తించారు.

"ఒక మహా సర్పం యీ ట్రైన్‌ని మింగబోయింది. భూమిలోపలి పొరల్లోంచి అది ఉద్భవించింది. హాహాకారాలు.. రక్తపాతం.. ఏవేవో జంతువులు మనుషుల్ని మింగేస్తున్నాయి. ఓ గద్ద వికృతంగా అరుస్తూ ఆకాశంలో చక్రికలు కొడుతోంది. దాని రెక్కల్నించి నిప్పులు రాల్తున్నాయి. ఎర్రని కళ్ళుగల ఓ అడవిమనిషి ఆ గద్దని పట్టుకోడానికి ఎగిరి ఎగిరి ప్రయత్నిస్తున్నాడు. అతను ఎగిరినప్పుడల్లా వందలకొద్దీ పాములు నేలమీదకి రాల్తున్నాయి. అంతా రక్తం. అంతా భీభత్సం" సన్నగా చెబుతూ కళ్ళు మూసుకుంది మహాకన్యాదేవి.

"ఇదంతా కలేనా, ఇంకేదన్నా చూశారా?" అడిగాడు విలేఖరి.

"అయ్యా రాత్రంతా జ్వరంతో ఒణికిపోయింది. దయచేసి తనని ఇబ్బంది పెట్టొద్దు" మెల్లగా అయినా స్థిరంగా వాళ్ళకి చెప్పింది మహామాయ.

ఏదో ప్రశ్నించాలని కూడా, మానుకుని కంపార్టుమెంటుని చూపిస్తున్నాడు వీడియోగ్రాఫర్. మహాకన్యాదేవికి తప్ప అందరికీ తలకి కట్లూ, చేతికి కట్లూ ఉన్నాయి. అవి డాక్టరు కట్టిన కట్టిన కట్లులా లేవు.

"ఎవరన్నా డాక్టర్సు వచ్చారా?" అడిగాడు విలేకరి.

"మా యీ అమ్మ కట్లు కట్టింది" మహామాయని చూపి అన్నాడు హనుమంతు.

"మీరంతా?" అడిగాడు విలేఖరి.

"మహాకాళేశ్వరం నించి ఢిల్లీకి వెళ్ళి అక్కడ్నించి వస్తున్నాం" అన్నాడు హనుమంతు.

"అమ్మా శరద్వతీ... ఆ అమ్మాయి ముఖంలో దైవత్వం గోచరిస్తున్నదమ్మా. సాక్షాత్తూ 'శోడశి'లా ఉన్నది. అందరూ శ్వేత వస్త్రాలు కట్టుకున్న కన్యలే. ఆ అమ్మాయి వారికి పూజనీయురాలిగా కనబడుతోంది. ఆ పిల్లవాడు సహాయకుడనుకుంటా. ఆ తలకట్టు కట్టుకున్న పెద్దావిడ వీరికి గార్డియనా? ఏమో, ఆ అమ్మాయికి మాత్రం రెండు చేతులూ ఎత్తి దండం పెట్టాలనిపిస్తోంది" అన్నారు పరమేశ్వర శాస్త్రిగారు రెండు చేతులూ జోడించి.

"అవును.. చూడగానే గర్భాలయం నించి కాశీ అన్నపూర్ణ వెలుపలికి వచ్చిందా అనిపించింది" తనూ చేతులు జోడించి అన్నాడు యజ్ఞప్ప.

"ఎక్కడో ఎవరో కనబడగానే ఇక్కడ్నించి దండాలు పెట్టేస్తున్నారు. అంత వెర్రి వెంగళప్పలు లోకంలో ఉండరు. సిల్లీ ఇండియన్స్" చికాగ్గా అన్నాడు రాబీ.

"యస్... చూడగానే మాకు మనసు చెబుతుంది. ఎవరు ఎవరో ఎటువంటివారో! మీ అభిప్రాయం మీది కానీ, మీ కోసం మా అభిప్రాయాలు మార్చుకోనక్కరలేదుగా" షార్ప్‌గా అన్నాడు గోర్కీ.

"బట్.. ఆమె ముఖంలో చాలా పవిత్రత ఉంది" అన్నాడు రజోవ్‌స్కీ.

"యస్.. లాట్ ఆఫ్ శానిటీ" అన్నాడు పీటర్ స్టిట్సన్.

టివిలో సీన్ మారింది.

'షౌకత్' బిల్డింగ్‌లో నామకరణ మహోత్సవం చూపిస్తున్నారు.

ఇద్దరు కేంద్రమంత్రులు అటెండ్ అయ్యారు. షగున్ (or) శకునిని చూపించారు.

"ఈ 'షౌకత్' బిల్డింగు మనని విడిచిపెట్టేదిలా లేదు. ఏదో విధంగా యీ బిల్డింగ్ మనకంట పడుతూనే ఉంది" అన్నాడు మొహమ్మద్ అతీం.

"ఏమో. మనం వెతుకుతున్నది అక్కడ దొరకొచ్చునేమో అన్నాడు శమంతో భట్టాచార్య.

"కారణం లేకుండా ఏదీ ఎప్పుడూ జరగదు. ఏదీ ఎవరికంటా పడదు" అన్నారు యజ్ఞప్ప.

"దద్లానీ తన ఆఫీసు విలేఖరికి ఫోన్ చేశాడుగా. త్వరలోనే యీ ప్రమాదపు గుట్టు రట్టు కావొచ్చు" అన్నాడు నరోత్తం ఝా.

"యస్.. త్వరితంగానే తెలుసుకుందాం" అన్నాడు సచేత్ దద్లానీ.

"బహుశా అందరం ఒకేచోట ఉంటూ ఇక్కడే లాక్ అయిపోతున్నామేమో" అన్నాడు జయ్.

"ఆ మాట నిజమే అయినా మరో దారి కనిపించడంలేదే" అన్నాడు శమంతో.

"పోనీ తక్షపురం వెడితే?" అన్నాడు నరోత్తం ఝా.

"ఏముందీ.. ఆ 'సర్పశిల' కు ఓ హారతిచ్చి రావడం జరుగుతుంది. అంతే. అక్కడ జరిగింది ఏమిటో 'మట్టూ' వివరించాడుగా! అతనికంటే గొప్పగా మనం అబ్జర్వ్ చెయ్యగలమని నేను అనుకోవడంలేదు. అందరూ ఒకచోటే కూర్చుని, ఏం చెయ్యాలో తెలీక బుర్రలు పగలుగొట్టుకోవడం కంటే, బృందాలుగా విడిపోయి పరిశోధించడం బెటర్ అని నాకనిపిస్తోంది" అన్నాడు మహదేవన్.

"ఆ మాట నిజం" తలాడించింది గౌరీదేవి. (వైఫ్ ఆఫ్ మహదేవన్.)

"మీరేమంటారు?" పరమేశ్వరశాస్త్రిని అడిగారు యజ్ఞప్ప.

"మరో దారి లేదుకదా! నేను శిథిలాలయం వైపు వెళ్ళి సంకల్పానందని కలుస్తా. అక్కడ వారికి లభించిన రంగుల రాయిని దర్శించాలని ఉంది. అమ్మవారినీ కొలవాలని ఉంది. అక్కడ రాత్రుల్ని గడిపి కొన్ని సంవత్సరాలయింది" అన్నారు పరమేశ్వర శాస్త్రి.

"నేనూ తమతో వస్తాను. మన 'నీలుడు'కూడా అక్కడే ఉన్నాడు" ఉత్సాహంగా అన్నాడు మట్టూ.

శృంగీ సాలోచనగా రామజోగి వంక చూశాడు.

"వెళ్ళాలనుకుంటే నువ్వూ శాస్త్రిగారితోనూ, మట్టూతోనూ శిథిలాలయానికి వెళ్ళు శృంగీ" గంభీరంగా అన్నాడు రామజోగి.

"అయితే నేనూ, గౌరీ, ప్రవస్తీ ఇవ్వాళే తిరువణ్ణామలైకి వెళ్ళిపోతాం" అన్నారు మహదేవన్.

"అవును. అదీగాక నిత్యపూజలు ఇప్పటికే ఇరుకునపడ్డాయి" అన్నది గౌరీదేవి.

"మరి మీరు?" అడిగారు పరమేశ్వరశాస్త్రి యజ్ఞప్పని.

"అందరి నిర్ణయాలూ విన్నాక నా నిర్ణయం చెబుతాను" అన్నారు యజ్ఞప్ప.. పద్మాసనం నించి లేస్తూ.

"అయ్యా నా మనసులో ఒక ఆలోచన వచ్చిందంటే, అది తొందరగా నన్ను వదలిపెట్టదు. ఇనుప ముక్కు గద్దల విలయతాండవం, గోవుల మృతి నా మనసులోంచి తొలగిపోలేదు. అందరినీ కలుపుకుని ముందరికెళ్దామని మీ అందరితో కలిశాను. ఒక్కసారి ఆలోచించండి –

తక్షపురంలో సర్పశిల

నల్లమల అడవుల్లో శిధిలాలయం

యాగం పూర్తయ్యాక అమూల్య రత్నం లభించడం.

మళ్ళీ మనుషులు రాలిపోవడం

రాబీకి గత జన్మ గుర్తుకి రావడం – పోవడం

ఢిల్లీలోనూ ఇతర నగరాల్లోనూ అకారణ మృత్యు తాండవం ముఖ్యంగా పురానా దిల్లీ 'షౌకత్' చుట్టుపక్కల.

మళ్ళీ యీ రైలు ప్రమాదం.. అదీ అకారణంగా.

ఇక చిన్నా చితక విపరీతాలైతే కోకొల్లలు.

మధ్యలో మహాభారత ఆయుధాలు.

గాంధారి శాపం.. శకుని పునర్జన్మ.

ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయో మనకి ఇప్పటివరకూ నిజంగా తెలీదు. తెలిసినా కూడా మనం వీటిని ఆపగలిగి ఉండేవాళ్ళం కాదు. అందరూ కలసి చర్చిస్తున్నా, ఏ మాత్రం సమస్యకి పరిష్కారం వైపు ముందడుగు పడటంలేదు. అలాగని చేతులు ముడుచుకుని మౌనంగా ఉండటానికీ మనసు ఒప్పుకోవడంలేదు. మనసులో పరిశోధించాలనే కోరిక ఉంది. చేతిలో పేపరు ఉంది. నేనీ పరిశోధన మానను. ఆపైన మీరు నాకు ఎలా మార్గదర్శకత్వం చేస్తే అలా నడుచుకుంటాను" అన్నాడు సచేత్ దద్లానీ.

"శభాష్.. పట్టు అంటే అలా ఉండాలి" మెచ్చుకున్నాడు జయ్.

"డియర్ సచేత్, మేము కూడా ఇందులోకి సహజంగా వచ్చినవాళ్ళం కాదు. రాబీ అన్నగారు ఎడ్వర్డ్ వెబ్‌స్టర్ నా మిత్రుడు. రాబీని విలియమ్స్ ఆవహించడం, తిరుపతి గోవింద రాజస్వామి గుళ్ళో రాబీ తన గత జన్మ జ్ఞాపకాలతో ప్రవర్తించడం, అదే విలియమ్స్ శ్రీనివాస్‌ని కూడా ఆవహించడం, అతన్ని మధ్యప్రదేశ్‌కి పంపి, శరద్వతితో వివాహం చేయించడం. తుఫాను.. మేమందరం మద్రాసు నించి తిరుమణ్ణామలై వచ్చి అక్కడ రాబీని చూడడం, అక్కడా విలియమ్స్ రాబీని ఆవహించడం చివరికి అందరం యీ తిరుపతిలో సమావేశం అవడం – ఇన్ని వ్యవహారాల్లోనూ మేమంతట మేము కావాలని పాల్గొనలేదు. అన్నీ యాదృచ్ఛికంగానే జరిగాయి. నెలలపాటు ఖాళీగా కూర్చోవడం ఎంత కష్టమో మీకు అనుభవంలోకి వచ్చిందిగా!" స్పష్టంగా ఓసారి సింహావలోకనం చేస్తూ అన్నాడు జయ్. అందరూ చక్కగా విన్నారు.

"టు బీ ఆర్ నాట్ టు బి ' లాగా ఉంది పరిస్థితి. నిజం ఏమంటే గడ్డివాములో గుండుసూదిని వెదకటంలాంటిది మనం మొదలుపెట్టిన కార్యక్రమం. తుది మొదలూ తెలీదు. ఏదో విపత్తు ముంచుకొస్తుందనే భావన మన అందరిలోనూ ఉంది. రావణాసురుడి వధ జరుగుతుందని కొన్ని వేలమందికి ముందే తెలుసు. ఆ రుషులు, మహర్షులు – బ్రహ్మ రుషులు ఏం చెయ్యగలిగారూ? ఆ .! ప్రజల్ని సిద్ధం చెయ్యగలిగారు. అలాగే కౌరవ పాండవ యుద్ధం తప్పదనీ, 18 అక్షౌహిణులు సైన్యం సర్వనాశనమౌతుందనీ, భీష్మ ద్రోణ విదుర కృష్ణార్జునులకి తెలియదా? తెలుసు.. వారికే కాదు, దృష్టద్యుమ, ద్రౌపది, దుర్యోధన, కర్ణ, వికర్ణుల వరకూ అందరికీ తెలుసు. గుడ్డిలో మెల్ల ఏమంటే, రాజపుత్ర సైన్యాలు దగ్ధం అయ్యాయి కానీ, సామాన్య మానవుల జీవితం కురుక్షేత్ర యుద్ధం వల్ల నాశనం కాలేదు. ఇక 1st 2nd ప్రపంచయుద్ధాలైతే సామాన్యుడ్ని సంకుల పరిస్థితిలోకి నెట్టాయి. హిరోషిమా నాగసాకి అణుబాంబుల వల్ల నాశనమైన సామాన్యుల సంఖ్యను లెక్కగట్టగలమా? మనం ఇదేదో తెలుసుకు తీరాలి. కనీసం సామాన్యులకి కనీస రక్షణ కల్పించడం కోసం. ఇది నా మనసులోని ఆలోచన" అన్నారు యజ్ఞప్ప.

"అయితే మీరు..?" సగంలో ప్రశ్నని ఆపాడు గోర్కీ.

"నిజం చెబితే యీ రామజోగి మనకి మార్గదర్శకుడౌతాడని నేను భావిస్తున్నా. అతన్ని నేను గమనిస్తూనే ఉన్నాను. గెలుపోటముల్ని సమంగా చూసే తత్వం అతనిది. శ్రీకృష్ణుడిలో ఎంత వైరాగ్యం ఉందో ఇతనిలోనూ అంతే వైరాగ్యం ఉంది. ఒకసారి పనిలోకి దిగితే లోతు అంచుల్ని తడమగల మనోశక్తి ఇతడిలో ఉంది. నాలో ఉన్నవి ఆశలు కోర్కెలు. అవికూడా సమాజానికి సంబంధించినవే. కానీ, నా వయసు కార్యరంగంలో అడుగుపెట్టనివ్వదు. రామజోగి కలలు కనగలడు, వాటిని నిజమూ చెయ్యగలడు. అతని మనోశక్తి అంతటిది. ఏం చెయ్యాలో ఏం చేస్తే మంచిదో రామజోగి చెబితే వినాలని నాకుంది" అన్నారు యజ్ఞప్ప.

"మీరన్నది నూటికి నూరుపాళ్ళూ నిజం" అన్నారు పరమేశ్వర శాస్త్రిగారు.. అందర్నీ చూస్తూ, రామజోగిని గమనిస్తూ.

అందరూ రామజోగి వంక తిరిగారు. అతనేమీ మాట్లాడలేదు "చెప్పండి గురువుగారూ" అన్నాడు శృంగి రామజోగితో.

"మీ నిర్ణయాన్ని అందరం గౌరవిస్తాం" అన్నాడు గోర్కీ.

అతనికి రామజోగితో పరిచయం కలిగింది తిరుపతిలోనే. రామజోగిని చూడగానే గోర్కీకి ఓ గౌరవం కలిగింది. రామజోగి చాలా నిష్టాగరిష్టుడని అతనికి అర్థమైంది. స్టిట్సన్, రజోవ్‌స్కీ, డాంటే, మహదేవన్, శ్రీనివాస్ అందరూ రామజోగి సమాధానం కోసం చెవులు రిక్కించారు.

"ఏమో.. నాతో ఎంతవరకూ యీ కార్యక్రమం ముందుకెళుతుందో. నిజం చెబితే నాకే ఓ స్పష్టత లేదు. ఒకటి మాత్రం ఇందాక, ఇందాక ఆ అమ్మాయిని చూశాక, మహాకన్యాదేవి అనికదూ న్యూస్‌లో చెప్పిందీ, ఆ అమ్మాయిని చూశాక నా మనసులోని అలజడి తగ్గింది. అయ్యా. కొన్ని అవిశ్రాంత ఆత్మల్ని శాంతింపోజేయడం కోసమే భగవంతుడు కొందర్ని సృష్టిస్తాడు. ఈమె ఆ కోవకి చెందింది. ఈమెని కలవాలి. కలిస్తే? అప్పుడు మనకి ఏదో తెలుస్తుందని అనుకోను. ఎందుకంటే శరీరం మాత్రమే ఆమెది. శరీరం లోపల ఉన్నది ఓ మహాచైతన్యం" ఠక్కున మాటల్ని ఆపాడు రామజోగి. నిశ్చేష్టులై వింటున్నారు అందరూ.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments